విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

వలంటీర్ల వ్యవస్థ ఆదర్శనీయం

జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: ప్రజలతో మమేకమై సేవలందించే 'వాలంటీర్ వ్యవస్థ' ప్రపంచానికే ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అన్నారు. జిల్లాలో ఉత్తమ సేవలందించిన వాలంటీర్లకు స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి సమావేశపు హాలులో గురువారం 'వాలంటీర్లకు అభినందన' కార్యక్రమం ద్వారా సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులకు ఎంపికైన వాలంటీర్లకు దుశ్శాలువా, మెడల్, ప్రశంసాపత్రం, నగదు బహుమతితో ఘనంగా సత్కరించారు. గుంటూరు జిల్లా నుండి రాష్ట్ర ముఖమంత్రి 'వాలంటీర్లకు అభినందన' కార్యక్రమమును ప్రత్యక్ష ప్రసారం ద్వారా సభికులు వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటివద్దకు అందిస్తూ,

ప్రజల జీవితాలలో ఒక భాగమైన వాలంటీర్ వ్యవస్థను ప్రపంచంలోనే మొదటి సారిగా మన రాష్ట్రంలో ప్రవేశ పెట్టారని, వాలంటీర్ వ్యవస్థ ఇతర రాష్ట్రాలకు ఆదర్శనీయంగా నిలిచిందన్నారు. ఇటువంటి వ్యవస్థ ద్వారా వాలంటీర్లు సేవే పరమావధిగా పనిచేస్తున్నారన్నారు. కోవిడ్ సమయంలోను, ఫీవర్ సర్వే, గోదావరి వరదల సమయంలో వాలంటీర్లు ప్రజలకు చేసిన సేవలు నిరుపమానమైనవని కలెక్టర్ కొనియాడారు. అనంతరం ప్రజలకు సంక్షేమ పథకాల అమలులో ఉత్తమ సేవలందించిన వాలంటీర్లలో సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులకు ఎంపికైన వాలంటీర్లకు దుశ్శాలువా, మెడల్, ప్రశంసాపత్రం, నగదు బహుమతితో కలెక్టర్ ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి పుష్పమణి, జిల్లా పంచాయతీ అధికారి తూతిక విశ్వనాథ్ శ్రీనివాస్, డి ఆర్ డి ఏ పీడీ ఆర్. విజయరాజు, డి ఎల్ డి ఓ విజయలక్ష్మి, బిసి కార్పొరేషన్ ఈడీ పుష్పలత జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఆర్. నాగరాణి, ప్రభృతులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆద్యంతం ఆర్టీసీ పీఆర్ ఓ నరసింహం చేసిన వ్యాఖ్యానం సభికులను ఆకట్టుకుంది.

ఓటర్లలో చైతన్యంకోసం స్వీప్

జిల్లాలో పోలింగ్ పెంపు లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు

కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో రాబోయే ఎన్నికల్లో అన్ని ప్రాంతాల్లో ఓటింగ్‌శాతాన్ని పెంచి ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా రానున్న 45 రోజులపాటు ముమ్మరంగా స్వీప్ చైతన్య కార్యక్రమాలను నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్, జిల్లా ప్రధాన ఎన్నికల అధికారి వె. ప్రసన్న వెంకటేష్ చెప్పారు. స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో గురువారం 'సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోల్ పార్టిసిపేషన్' కార్యకలాపాలు, స్వీప్ 2024 జిల్లా కార్యాచరణ ప్రణాళిక అమలుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లాకలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వీప్ కార్యక్రమాలకు సంబంధించి రూపొందించిన యూట్యూబ్, ఇన్ స్టాగ్రామ్ తదితర సోషల్ మీడియా మాధ్యమాలను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఓటర్లను చైతన్య పరిచేందుకు అవగాహన పరిచే పలు గోడపత్రికలను కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ విడుదల చేశారు. కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ టర్నోవర్ ఇంప్లిమెంటేషన్ ప్లాన్ రూపొందించు కొని దానిని క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయాలన్నారు. జిల్లాలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 90 నుంచి 92 శాతం పోలింగ్ నమోదయ్యేలా అన్ని ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఇందుకు పటిష్టమైన ప్రణాళికను రూపొందించిన స్వీప్ నోడల్ అధికారి, డిపివో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్‌ను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి డి. పుష్పమణి, జంగారెడ్డిగూడెం ఆర్డీఓ అద్దయ్య, డిఇఓ అబ్రహాం, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపిడివోలు, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

అనాధ విద్యార్థులకు ఆర్థిక సాయం

ఆర్థిక సాయంలో పాల్గొన్న జర్మనీలు

విశాలాంధ్ర - లింగపాలెం : జర్మనీ దేశంలో క్రైస్తవ మత గురువుగా పనిచేస్తున్న సొంగా ఆదాం తన స్వగ్రామమైన ధర్మాజీగూడెంకు గురువారం విచ్చేశారు. ఈయనతోపాటు జర్మనీ దేశానికి చెందిన చెబుల్లా రైనర్, పేతర్ ఈరి, ఎలిజిబెత్ బార్తోషిక్ ఆధ్వర్యంలో 17 మంది గ్రామంలో పర్యటించారు. ఈసందర్భంగా మత గురువులు సొంగా ఆదాం 66 మంది అనాధ విద్యార్థులకు రూ. 3 లక్షల విరాళాన్ని జర్మనీ దేశస్థుల బృందం సభ్యుల చేతుల మీదుగా అందించారు. జర్మనీ దేశస్థులు గ్రామంలోని ప్రజల జీవన విధానం, స్థితిగతులను పరిశీలించారు. వీరికి ఆర్‌సీఎం మత గురువు ఆనంద్‌బాబు, సహాయ గురువు జాన్ సందీప్‌ల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక ఆర్‌సీఎం సంస్థ పెద్దలు, విశ్వాసులు ఆదాంను, జర్మనీ దేశస్థులను ఘనంగా సన్మానించారు.

బావిలో పడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర - లింగపాలెం : నేల బావిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన పుప్పాలవారిగూడెంలో గురువారం వెలుగులోకి వచ్చింది. మృతుడు చింతలపూడి మండలం బాలవారిగూడెంకు చెందిన రాయల రవి(23)గా గుర్తించారు. మంగళవారం రాత్రి పుప్పాలవారిగూడెంలో కోడి పందేలు వేసేందుకు సన్నాహాలు చేసుకున్నట్లు స్థానికుల కథనం. పోలీసులకు సమాచారం వెళ్ళటంతో పందేలకు వచ్చిన వారు చెల్లాచెదురయ్యారు. ఈ సమయంలోనే నేల బావిలో పడినట్టుగా అనుమానిస్తున్నారు. మృతుడు రాయల రవి ఆచూకి కోసం గాలిస్తుండగా బావిలో శవమై కనిపించాడు. దీనిపై పోలీసులకు సమాచారం ఇవ్వటంతో కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని బావి నుంచి వెలికితీయించి శవపంచనామా చేసి పోస్టుమార్టంకు పంపారు. సంఘటనా స్థలానికి సీఐ సుధాకర్ వచ్చి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆర్థిక సాయం

విశాలాంధ్ర - లింగపాలెం : మైత్రీ డవలపర్స్ వ్యవస్థాపకులు భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి లింగపాలెంలో పర్యటించి పలువురికి ఆర్థిక సాయం అందించారు. గ్రామంలో అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన సిరా నాగేశు, మానికల రాము, పట్నాల ప్రసాద్, కుటుంబ సభ్యులకు రూ. 10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. టీసీహెచ్ఆర్ పాలెంలో కిడ్నీల వ్యాధితో బాధపడుతున్న బాధితునికి రూ. 25 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

కృంగిన ఏటిగట్టు పనులపై రిటైర్డ్ హైకోర్టు జడ్జితో విచారణకు ఆదేశించాలి

విశాలాంధ్ర-నరసాపురం: కుంగిన ఏటిగట్టు పనులపై హైకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని మాజీ శాసనసభ్యులు బండారు మాధవ నాయుడు డిమాండ్ చేశారు. గురువారం పొన్నపల్లి ఏటిగట్టు కుంగిన ప్రాంతాన్ని బండారు మాధవ నాయుడు పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఏటిగట్టు పనులు నాణ్యత లోపం వల్లే ఇప్పటికే నాలుగు సార్లు కృంగిందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు బినామీ కాంట్రాక్టర్ రూ.26 కోట్ల 32 లక్షల నిధులతో చేస్తున్న ఈ పనుల్లో క్వారీ రిజెక్టెడ్ రాళ్లు ఉపయోగించడం వల్లే పొన్నపల్లి ప్రాంత ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. గోదావరి ప్రశాంతంగా ఉన్న సమయంలోనే ఈ విధంగా ఉంటే వరదల సమయంలో ఈ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కోవలసి వస్తుందని అన్నారు. పనుల్లో భారీ అవినీతికి పాల్పడడం వల్లే నిత్యం ఏటిగట్టు కోతకు గురవుతున్నదని దీనిపై గతంలోనే సీఎం జగన్ తోపాటు గవర్నర్‌కు కూడా ఫిర్యాదు చేశామని అధికారులు ఎప్పటికప్పుడు వచ్చి సమర్థిస్తున్నారు తప్ప సరైన విచారణ చేయలేదని ఆయన మండిపడ్డారు.

విద్యార్థుల జీవితాలలో పది పరీక్షలు తొలిమెట్టు

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : విద్యార్థుల జీవితంలో 10వ తరగతి పరీక్షలు తొలిమెట్టు అని, పదవ తరగతి పరీక్షలు బాగా రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలని మానవతా సంస్థ స్పీకర్ తాడేపల్లి మోహన్ రావు, జిల్లా మానవతా అధ్యక్షుడు ఏలూరు వీరాస్వామి, జిల్లా కన్వీనర్ త్రిపుర రమ్యశ్రీ,లు పేర్కొన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కొయ్యలగూడెం యూనిట్ ఆధ్వర్యంలో మండలంలో అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు మానవతా సంస్థ ఆధ్వర్యంలో కెరియర్ గైడెన్స్ కార్యక్రమాన్ని గవరవరం సాయి రాకేష్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ వద్ద నిర్వహించారు. విద్యార్థులకు పుస్తకాలు మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కొయ్యలగూడెం మానవతా చైర్మన్ వి. ఎస్.ఎన్. స్వామి, మండల అధ్యక్షుడు బొమ్మ మోహన్ రావు, ముప్పనపల్లి వెంకటేశ్వరరావు, నక్క బాబి, సాయి రాకేష్ స్కూల్ ప్రిన్సిపాల్ అశోక్ కుమార్, శ్రీనివాస్, లక్ష్మి,రాంబాబు, భరత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణానికి హెల్మెట్ ధారణ సురక్షితం

విశాలాంధ్ర-ఏలూరు: ట్రాఫిక్ నిబంధనలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండి రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా సురక్షిత ప్రయాణాలు చేయాలని ఉప రవాణా కమిషనర్ ఎస్. శాంతి కుమారి తెలిపారు. గురువారం స్థానిక సిఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ నుండి రోడ్డు ప్రమాదాల నివారణ వారోత్సవాల్లో బాగంగా హెల్మెట్ ర్యాలీని ఉప రవాణా కమిషనరు ఎస్. శాంతకుమారి, జిల్లా అధనపు ఎస్ పి జి. స్వరూపరాణి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప రవాణా కమిషనరు శాంతకుమారి మాట్లాడుతూ పోలీసు, రవాణా శాఖ సమన్వయంతో వాహనదారుల భద్రత, ప్రయాణికుల సంక్షేమమే ధ్యేయంగా రోడ్డు భద్రత వారోత్స వాలను జనవరి 20వ తేదీ నుండి ఈ నెల19 వరకు నిర్వహిస్తున్నామన్నారు. హెల్మెట్ ధరించి ప్రయాణించడం ప్రయాణ దారులకు రక్షణకు రక్షణపై అవగాహన కలిగించడానికి హెల్మెట్ ర్యాలీని నిర్వహిస్తున్నామని అన్నారు. 2030 నాటికి దేశంలో 50 శాతం రోడ్డు ప్రమాదాలను తగ్గించే విధంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా అదనపు ఎస్పి జి. స్వరూపరాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అతివేగంగా వాహనాన్ని నడపకుండా ప్రశాంతంగా ప్రయాణించాలని, నాణ్యత గల హెల్మెట్‌ను ధరించి, ట్రాఫిక్ రూల్స్ ను పాటిస్తూ వాహన ప్రమాదాలకు గురికాకుండా ఉండాలని ప్రయాణించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏలూరు డిఎస్ పి శ్రీనివాసరావు, పోలీసు అధికారులు, రవాణా శాఖ అధికారులు, మోటారు వెహికల్స్ షోరూం సిబ్బంది తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.

మహిళల చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మన్నవ యామిని

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: మహిళా చట్టాలను పరిరక్షించి, పటిష్టంగా అమలు చేసి మహిళల ఆత్మ గౌరవాన్ని కాపాడాలని ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలం లోని విప్పలపాడులో మంగ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య బుట్టాయిగూడెం మండల సమితి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మన్నవ యామిని మాట్లాడుతూ నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్ (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) ప్రాముఖ్యతను, నాయకులు పోరాడి సాధించుకున్న చట్టాలు గురించి తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలనుమోసం చేస్తూ రైతులకు కార్మికులకు తీరని నష్టాన్ని చేస్తున్నారని విమర్శించారు. గర్భిణీలకు ఇవ్వాల్సిన రూ. 6 వేలు ఇవ్వకుండా, మహిళలపై జరుగుతున్న దాడులను అరాచకాలను అరికట్టకుండా వారిని ఉద్ధరిస్తున్నట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకుంటున్నాయని ఆమె ఎద్దేవా చేశారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్ ఇచ్చి మహిళల సాధికారత మా ద్వారానే సాధించామని గొప్పలు చెప్పుకుంటూ మహిళలను మోసం చేస్తున్నారని ఆమె విమర్శించారు. గర్భిణీలకు మెటర్నటీ సెలవు దినాలు 16 నుంచి 27 వారాల వరకు పెంచామని చెబుతూ మహిళలను మోసం చేస్తున్నారన్నారు. మహిళా చట్టాల పరిరక్షణకు మహిళలందరూ ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమం అనంతరం బుట్టాయిగూడెం మండలం మహిళ సమాఖ్య నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో కారం నాగ దుర్గ ,కొమరం గౌతమి, బన్నే రామలక్ష్మి, గుండు నాగరత్నం, సోడె మహేశ్వరి ,విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

9న జాతీయ లోక్‌అదాలత్

విశాలాంధ్ర-ఏలూరు: మార్చి 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్న ప్రసాద్ అన్నారు. గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనము నందు కార్యదర్శి కె .రత్న ప్రసాద్, పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కె.రత్న ప్రసాద్ మాట్లాడుతూ మార్చి9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, వాహన ప్రమాద బీమా కేసులు, ఆర్బిట్రేషన్ ఓపీలు, చిట్ ఫండ్ కేసులు, బ్యాంకు లావాదేవీలు, కుటుంబ తగాదాలు తదితర కేసులను రాజీ చేయనున్నట్టు తెలియజేశారు. పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్ పర్సన్ ఎ. మేరీ గ్రేస్ కుమారి మాట్లాడుతూ ప్రతిరోజు రాజీయోగ్యమైన కేసులలో ప్రీ సిట్టింగ్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నా మని, రాజీ పడదలుచుకున్న కక్షిదారులు నేరుగా, న్యాయవాది ద్వారా తమ కేసుల వివరాలను సంబంధిత కోర్టులకు లేదా పర్మినెంట్ లోక్ అదాలత్‌ను సంప్రదించాలన్నారు. ఈ కేసుల మధ్యవర్తిత్వానికి హాజరుకాలేని దూర ప్రాంతాల్లో నివసిస్తున్న కక్షిదారులు ఆన్లైన్ మార్గం ద్వారా కూడా కేసుల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలియజేశారు. న్యాయవాదులు, కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని రాబోయే నేషనల్ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి కృషి చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

నేడు గ్రామీణ బంద్ జయప్రదం చేయండి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: దేశ వ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక,రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చ పిలుపులో భాగంగా ఈనెల 16వతేదీ శుక్రవారం జరిగే దేశ వ్యాప్తంగా జరిగే గ్రామీణ భారత్ బంద్,పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి జె.వి.రమణ రాజు పిలుపునిచ్చారు.ఈ మేరకు గురువారం రమణ రాజు ఒక ప్రకటన విడుదల చేశారు.కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చినప్పటినుండి దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలు, మతతత్వ ధోరణులకు నిరసనగా ఈ నెల 16న జరిగే కార్మికుల సమ్మె,గ్రామీణ బంద్‌లో రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, పాల్గొనాలని ప్రకటనలో పేర్కొన్నారు.

ఆడుదాం-ఆంధ్ర రాష్ట్రస్థాయి పోటీల్లో ఏలూరు జిల్లా ఖ్యాతి

క్రీడాకారులను అభినందించిన కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు అభివృద్ధికి చర్యలు

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయలు విడుదల చేయనున్నదని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ చెప్పారు. ఆడుదాం-ఆంధ్ర క్రీడా టోర్నమెంట్ లో క్రికెట్, బ్యాడ్మింటెన్ పోటీల్లో ప్రథమస్థానం పొందిన విజేతలను స్థానిక గోదావరి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సత్కరించి అభినందించారు. జిల్లా బ్యాడ్మింటన్‌లో ఆడుదాం ఆంధ్రా రాష్ట్ర స్థాయి పోటీలో ప్రథమ స్థానం పొందడం అభినందనీయమని ,ఈ విషయంపై రాష్ట్ర స్పోర్ట్స్ కార్యదర్శితో తాము సంప్రదించగా ఇండోర్ స్టేడియంలో కూలిపోయిన బ్యాడ్మింటన్ కోర్టు తిరిగి పునరుద్ధరణకు కోటి రూపాయలు మంజూరు చేస్తున్నట్లు వారు తెలిపారన్నారు. దీనికి అదనంగా జిల్లాస్థాయిలో మరిన్ని నిధులు సమకూర్చి బ్యాడ్మింటన్ కోర్టు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. క్రికెట్ టోర్నమెంట్‌లో మొదటిస్థానం పొంది రూ. 5 లక్షలు, బ్యాడ్మింటెన్‌లో మొదటి స్థానం పొంది రూ. 3 లక్షలు, నగదుతోపాటు విజేతలు షీల్డ్, కప్ లను పొందడం అభినందనీయ మన్నారు. బ్యాడ్మింటన్ క్రీడాకారుడు వంశీకృష్ణరాజు ఉత్తమ క్రీడాకారుడిగా ఎంపికకావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కలవకొల్లు సాంబ,ఐటిడిఎ పివో యం. సూర్యతేజ, జిల్లా రెవిన్యూ అధికారి డి. పుష్పమణి, డిపిఓ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, డిఎస్‌డిఓ బి. శ్రీనివాసరావు, పలువురు క్రీడా కోచ్ లు, పిఇటిలు, క్రీడాకారులు పాల్గొన్నారు

భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

విశాలాంధ్ర-నరసాపురం: నరసాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టువిధులు బహిష్కరించారు. ప్రభుత్వం వెంటనే భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. గత 4నెలలుగా అనేక రూపాలలో న్యాయ వాదులు నిరసన తెల్పుతున్నా ప్రభుత్వం స్పందించటం లేదని వెంటనే భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. బార్ అధ్యక్షులు చల్లా దానయ్య నాయుడు, ఆర్ జి కుమార్, కంబాల స్వర్ణ, కొప్పినేడి పద్మజ, నెక్కంటి క్రాంతి కుమార్, దొంగ సుభాష్, చేగొండి బాలాజీ, వెంకట రామారెడ్డి, చొదదాసి శ్రీధర్, నారిన శ్రీను పోలిశెట్టి సూరిబాబు, గునిసెట్టి శ్రీను, డి.రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అభ్యసన పరిశీలన

విశాలాంధ్ర-ఆగిరిపల్లి: జ్ఞానప్రకాశ్‌లో భాగంగా పాఠశాలల్లో అమలవుతున్న కార్యక్రమాలను పరిశీలించడానికి స్టేట్ ట్రైనింగ్ అసోసియేట్ ఎం.పాండురంగారావు ఫౌండేషన్ పాఠశాల, ఈదర మెయిన్ ను సందర్శించారు. ప్రతి విద్యార్థి అభ్యసనను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.కృత్యాధార బోధన ద్వారా పాఠశాలలో అమలవుతున్న కార్యక్రమాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మక్కె వేణుగోపాలరావు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని ఎం.నిర్మలాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏటిగట్టు పనుల్లో ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని నమ్మవద్దు

విశాలాంధ్ర-నర్సాపురం: పట్టణంలో పొన్నపల్లి ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఏటిగట్టు కృంగిన ప్రాంతాన్ని గురువారం ఉదయం నరసాపురం శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి ఏటు గట్టు పనులు తాత్కాలికంగా చేసేవి కావు శాశ్వత నిర్మాణాలని ఆయన పేర్కొన్నారు.దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏటిగట్టు పనులను ఆధునికరించడం జరిగిందన్నారు. అదే వరవడిని ముఖ్యమంత్రి జగన్ కొనసాగిస్తున్నారని చెప్పారు. నరసాపురం పట్టణంలోని మాధవాయిపాలెం ప్రాంతంలో గోదావరి నది ఒంపు తిరగడం వలన నదీ ప్రవాహం సూటిగా వచ్చి నిర్మాణంలో ఉన్న ఏటిగట్టును తాకటం వలన గట్టు నదిలోకి జారుతోందన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్‌కు చెప్పగా స్పందించినా ఆయన గట్టు శాశ్వత పటిష్టంగా నిర్మాణం చేయుటకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఏటిగట్టు నిర్మాణ పనుల్లో అవినీతి జరిగిందంటూ ప్రతిపక్షాలు ప్రచారం చేయడం తగదన్నారు. ఈ విషయంలో దుష్ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఆయన సూచించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్ పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, స్థానిక కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

రమేష్‌బాబుకు నివాళులు

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: స్థానిక సత్యవతి నగర్‌కు చెందిన జె.రమేష్ బాబు 872 ఎల్. టీ.రెజిమెంట్ ఇన్ఫెంట్రీ దక్షిన్ భారత్ ఏరియా,కోల్‌కతలో విధులు నిర్వహిస్తున్నారు.రమేష్ బాబు అస్వస్థతైన కారణంగా కలకత్తా ఆర్మీ ఆసుపత్రిలో ఈ నెల 14 ఉదయం 10.57 నిమిషాలకు తుది విశ్వాస విడిచారు. వారి మృతి పట్ల ఎన్.సి.సి ఉన్నతాధికారులు ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియజేశారు.పార్థివదేహానికి కలకత్తా నుండి హైదరాబాదుకు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం ద్వారా హైదరాబాద్ కు తరలించగా, ఏ. పి, తెలంగాణ డైరెక్టరేట్ వారు హైదరాబాద్ నుండి అంబులెన్స్ ద్వారా తాడేపల్లిగూడెంనకు తరలించారు. తాడేపల్లిగుడెం లో 19(ఏ) బి ఎన్ ఎన్ సి సి, విభాగానికి చెందిన కల్నల్ సౌరబ్ ముఖర్జీ పార్థివదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏలూరు ఎన్ సి సీన్సీభాగానికి చెందిన కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ముఖర్జీ, ఇన్స్ట్రక్టర్ సుబ్రహ్మణ్యం,ఎన్ సి సి సిబ్బంది సబేదార్ ఆదినారాయణ, సుబేదార్ దోమిని నాయెబ్. సుబేదార్ మీ బూసింగ్, అప్సోరి హవల్దార్ కేసెందర్ సింగ్, బి. నవీన్, టి.భోగేశ్వరరావు పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం ఎన్ సి సి అధికారి కె.వి గణపతి రావు పర్యవేక్షణలో కార్యక్రమాన్ని నిర్వహించారు. రమేష్ బాబుకు భార్య బిందు, కుమారుడు అఖిల్ ఉన్నారు.

ఎన్.ఆర్.పి. అగ్రహారంలో సీపీఐ నిధి సేకరణ

విశాలాంధ్ర-ఉండి: ప్రజా పోరాటాలే ఊపిరిగా పనిచేస్తున్న సీపీఐ ఉద్యమ నిధికి విరివిగా విరాళాలిచ్చి సహకరించాలని సీపీఐ ఉండి మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు కోరారు. గురువారం ఎన్ ఆర్‌పి అగ్రహారం గ్రామంలో సీపీఐ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి నిధి సేకరణ చేశారు. ఈసందర్భంగా కలిశెట్టి మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న ధరల నియంత్రణకు, రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సీపీఐ నిరంతర పోరాటాలు సాగిస్తుందన్నారు. ప్రజల అభ్యున్నతికి నిర్విరామంగా కృషి చేస్తున్న సీపీఐ ఉద్యమాభివృద్ధికి విరాళాలిచ్చి సహకరించాలని కోరారు.సీపీఐ నాయకులు సనపల శ్రీను, వీరవల్లి గద్దియ్య, పెద్దింటి సింహాచలం, శివరాత్రి వెంకన్న, కోరుకొండ యేసు, తోట శాంభ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సు, లారీ ఢీ

27 మందికి గాయాలు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: గురువారం ఉదయం స్థానిక బైపాస్ రోడ్డులో ఆర్టీసీ బస్సును లారీ ఢీ కొట్టిన ఘటనలో 27 మందికి గాయాలు కాగా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి గురువారం ఉదయం 7:45 లకు బుట్టాయగూడెం మండలం దొరమామిడి నుండి జంగారెడ్డిగూడెంకు ఆర్టీసీ బస్సు బయలుదేరింది. జంగారెడ్డి గూడెం ఎస్సార్ బంకు వద్ద బైపాస్‌ను దాటి ఊరిలోకి వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక భాగాన్ని అశ్వరావుపేట నుండి రాజమండ్రి వైపు వెళ్లే లారీ వేగంగా ఢీ కొట్టింది. ఈ బస్సులో 57 మంది ప్రయాణికులు ఉండగా 27 మంది ప్రయాణీకులు గాయాల పాలయ్యారు. స్థానికులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసినా స్పందించక పోవడంతో ఆటోల ద్వారా బాధితులను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు.అక్కడ వీరికి వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. వీరిలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బుట్టాయిగూడెం మండలం ముప్పినవారిగూడెం గ్రామానికి చెందిన నక్కా అలివేలుకు తలకు తీవ్ర గాయం అవ్వడంతో ఆమెతోపాటు తీవ్రంగా గాయపడిన మోత్రపు సందీప్ ,బొడే ప్రభాస్,కే.ప్రవీణ్ కుమార్, కొర్శ రామ సీత లను మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు రిఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్షత గాత్రులను కాంగ్రెస్ పార్టీ నాయకులు జెట్టి గురునాధరావు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ,ఆర్టీసి డి.ఎం ,పోలీసు అధికారులు పరామర్శించారు.

ఇండోర్ స్టేడియం ప్రారంభం

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: డాక్టర్ పి ఎల్ వి ప్రసాద్ ఆసుపత్రి ప్రక్కన నూతనంగా నిర్మించిన ఇండోర్ స్టేడియంను ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ గురువారం ప్రారంభించారు. స్టడియంతో పాటు వివిధ విభాగాలను ప్రారంభించారు. మూడు షటిల్ కోర్టులను, టేబుల్ టెన్నిస్ కోర్టును, జిమ్ ను ప్రారంభించారు. ఓ.పి. గోయింకా , నంద్యాల కృష్ణ మూర్తి , డాక్టర్ జీవీ రెడ్డి ఇందుకూరి రంగరాజు (చంటి) తదితరులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పసుమర్తి శోభారాణి డాక్టర్ గన్నమని శ్రీనివాసరావు, కర్రీ భాస్కర్ రావు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, యగ్గిన నాగబాబు తదితరులు పాల్గొన్నారు. తొలుత ఉప ముఖ్యమంత్రి ఇండోర్ స్టేడియం ను ప్రారంభించడంతోపాటు కీర్తిశేషులు డాక్టర్ పసుమర్తి లక్ష్మి వరప్రసాద్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. డాక్టర్ ప్రసాద్ సేవలు అభినందనీయమని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు.దాతలు ముందుకు వచ్చి మంచి ఇండోర్ స్టేడియంలో నిర్మించడం అభినందనీయం అన్నారు.

నాయకుల గృహనిర్బంధం

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 15వ తేదీన విజయవాడలో సిపిఐ అనుబంధ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఏలూరు జిల్లా నుండి నాయకులు గాని అగ్రిగోల్డ్ బాధితులు గాని విజయవాడ వెళ్లకుండా బుధవారం ఉదయం నుండే పోలీసులు నోటీసులు ఇచ్చి గృహ నిర్బంధాలకు పూనుకున్నారు. ఏలూరులో అసోసియేషన్ జిల్లా నాయకులు బండి వెంకటేశ్వరావును, యర్రా వెంకటేశ్వరావును, కైకలూరులో సిహెచ్ జగన్ రాంబాబు తదితర నాయకుల ను పోలీసులు గృహ నిర్బంధించారు. నాయకుల్ని గృహ నిర్బంధం చేయటం సిగ్గుచేటు అని అసోసియేషన్ నాయకులు బండి వెంకటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు.

సామూహిక ఎలుకల నివారణకు రైతులు సహకరించాలి

విశాలాంధ్ర - నిడమర్రు: మండలంలో దాళ్వా వరి పంట 2023-24 సంవత్సరానికి సంబంధించి సామూహిక ఎలుకలు నివారణ కార్యక్రమా నికి రైతులు సహకరించాలని నిడమర్రు మండల వ్యవసాయ అధికారి ఎస్. గీతాదేవి గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి మండలంలో బువ్వనపల్లి, ఎనికేపల్లి, అడవికొలను గ్రామంలో ఎలుకల కన్నాలు మూసివేసినట్టు తెలిపారు. శుక్రవారం 96 పాళ్లు నూకలు, రెండు పాళ్ళ నూనె, రెండు పాలు బ్రోమోడైయాలిన్ మందుగా కలిపి ఎర తయారు చేయడం జరుగుతుందని ఈ ఎరను ఎలుకల కన్నాల వద్ద పెట్టనున్నట్టు తెలిపారు. రైతులు ఉపయోగించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు ఎస్. హనుమంతరావు, సాయి, జబీస్, రైతులు కె. సింహాచలం, పాపోలు సుబ్బారావు, మజ్జి శ్రీనివాసరావు, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి

విశాలాంధ్ర- పెంటపాడు: నేటి సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరచలేదని, వ్యవసాయం, పరిశ్రమలు, గనులు, విద్యుత్ అటవీ సంపదలను, రవాణా బ్యాంకులు, ఎల్ఐసి, తదితర సంస్థలన్నింటిని అంబానీ,అదానీ తదితర కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నదని అన్నారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హెూదా, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ఇవ్వాల్సిన ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయడం లేదన్నారు.నేడు జరగబోయే బైక్ ర్యాలీలో పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా పాల్గొనాలన్నారు.

ఉంగుటూరులో పోటాపోటీ ప్రచారం

ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న వైసీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ

విశాలాంధ్ర - ఉంగుటూరు : ఉంగుటూరు నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కింది. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఉంగుటూరు నియోజవర్గం నుండి పోటీ చేయడానికి పలు రాజకీయ నాయకులు పోటీకి సిద్ధమయ్యారు. అధికారికంగా

ఇప్పటివరకు ఏ పార్టీ అభ్యర్థులను ప్రకటించకపోయినా ఎవరికి వారు ఎన్నికల ప్రచారం చేసుకుంటున్నారు.అధికార పార్టీ వైసీపీ తరఫున పుప్పాల వాసు బాబు టిక్కెట్టు దాదాపు ఖరార్ అయినట్లు ప్రచారం సాగుతున్నది. పొత్తులో టిడిపికి టిక్కెట్ ఇస్తే గన్ని వీరాంజనేయులు, జనసేనకు ఇస్తే పత్స మట్ల ధర్మరాజు పోటీ చేస్తారు. బిజెపి తరఫున ఆ పార్టీ ఉంగుటూరు అసెంబ్లీ కన్వీనర్ శరణాల మాలతీ రాణి పోటీకి సిద్ధమవుతున్నారు. గత ఆరు నెలల నుండి ఉంగుటూరు నియోజక వర్గంలో ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసు బాబు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో గడపగడపకు వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. టిడిపి,జనసేన ఉమ్మడి పార్టీ అభ్యర్థులకు పొత్తులో ఎవరికీ టిక్కెట్ కేటాయించక పోయినా ఇరు పార్టీ అభ్యర్థులు వేర్వేరుగా నియోజకవర్గంలోఎన్నికల ప్రచారం చేసుకుంటున్నారు. బిజెపి తరఫున ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీ రాణి ఎన్నికల ప్రచారం చేసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పనులు నినాదంతో మాలతి రాణి ఎన్నికల ప్రచారం చేసుకుంటున్నారు. ఇప్పటివరకు ఎమ్మెల్యే అభ్యర్థులను ఏ పార్టీ ప్రకటించలేదు. చివరికి టిక్కెట్లు ఎవరికి వస్తాయో వేచి చూద్దాం.

సమస్యల పరిష్కారానికి ఉద్యోగుల నిరసనలు

విశాలాంధ్ర - ముదినేపల్లి : సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ ఎన్జీవోస్ మండవల్లి యూనిట్ అధ్యక్షులు ఎం.వి సుబ్బారావు డిమాండ్ చేశారు. ఏపీ ఎన్జీవోస్ ఈస్ట్ కృష్ణ అధ్యక్షులు ఉల్లి కృష్ణ పిలుపుమేరకు ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్ల

రిబ్బన్లను ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమకు రావలసిన రెండు డి ఏ లు , మధ్యంతర భృతి 30 శాతం, పిఎఫ్ బకాయిలు విడుదల చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది ఏవో రమణబాబు , సీనియర్ అసిస్టెంట్ ఎం నాగేశ్వరరావు, డి. దాని, ఎంఈఓ కార్యాలయం , ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

సిపిఎస్ రద్దు కోరుతూ యుటిఎఫ్ క్యాంపెయిన్

విశాలాంధ్ర- ఉంగుటూరు: సిపిఎస్ రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని వివిధ రాజకీయ పార్టీలను కోరుతూ విరామ సమయంలో యూటీఎఫ్ ఉంగుటూరు మండల శాఖ పక్షాన పోస్ట్ కార్డు క్యాంపెయిన్ గురువారం జరిగింది. మండల యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పునుముల రాంబాబు. దాకి జోగినాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడుకి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కి,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ షర్మిలరెడ్డి కివారి వారి పార్టీ మేనిఫెస్టోలో ఓపిఎస్‌ను ప్రవేశపెడతామని వారి వారి మేనిఫెస్టోలో పేర్కొనాలని పోస్ట్ కార్డు రాయడం ద్వారా విజ్ఞప్తులు చేశామని యుటిఎఫ్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు శీతాల సత్యనారాయణ, కార్యదర్శి సిహెచ్ శ్రీధర్, ఉపాధ్యక్షులు హరికృష్ణ,కోశాధికారి ఊట. ఆనందకుమార్,జిల్లా కౌన్సిలర్స్ పుప్పాల నరసింహారావు, బొమ్మిడి ప్రసాద్ తీడ. శ్రీధర్.కె ప్రేమ్ కుమార్, గొల్లగూడెం హైస్కూల్ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వివాహ రిసెప్షన్ వేడుకలలో జనసేన ధర్మరాజు

విశాలాంధ్ర - నిడమర్రు: నిడమర్రు మండలం గుణపర్రు గ్రామానికి చెందిన కాకులపాటి కిషోర్ వివాహ రిసెప్షన్ వేడుకకు ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు గురువారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఆయనతోపాటు ఈ వేడుకలో నిడమర్రు మండలం జనసేన పార్టీ అధ్యక్షులు నిమ్మల దొరబాబు, జనసేన నాయకులు పట్టపు హేమంత్, వంగ రఘు, గోలి సాయి పుండరీకాక్షుడు, బేతు మురళి, సూరత్తుల అయ్యప్ప, తాడిశెట్టి శివ, గౌతు వెంకన్న, ముదునూరి ప్రసాద్, గ్రామ జనసైనికులు, తదితరులు పాల్గొన్నారు.

కవిటంలో వైభవంగా శ్రీ కాళహస్తీశ్వర స్వామి కళ్యాణోత్సవం

విశాలాంధ్ర-పోడూరు : కవిటం గ్రామంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న శ్రీ అతిరుద్ర మహాయాగ మహోత్సవాలలో భాగంగా 5వ రోజయిన గురువారం వేదపండితులు రుద్ర హోమం, చండీ హోమం, అభిషేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పెనుమంట్ర మండలం నెలమూరు కు చెందిన శ్రీ ఉమా రామలింగేశ్వర ట్రస్ట్, శర్వాణి స్కూల్ ఆధ్వర్యంలో దాతలు, భక్తులు,

గ్రామస్తుల సహకారంతో ఈ యాగ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. వైయస్సార్సీపి నరసాపురం ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల యాగ మహోత్సవం లో పాల్గొన్నారు. యాగమహోత్సవం లో భాగంగా శ్రీ జ్ఞాన ప్రసునాంబ సమేత శ్రీ కాళహస్తీశ్వర స్వామి దివ్య కళ్యాణోత్సవం వైభవంగా జరిపారు. ఆధ్యాత్మికవేత్త జంధ్యాల శ్రీనివాస శర్మ(నెలమూరు శర్మ), కవిటం సొసైటీ చైర్మన్ కర్రి శ్రీనివాసరెడ్డి, గుడిమెట్ల రామ కనకారెడ్డి, సత్తి మురళీకృష్ణ రెడ్డి , సత్తి రామచంద్రారెడ్డి, గాదే శ్రీనివాసరావు, పడాల వెంకట సత్యనారాయణ రెడ్డి, కర్రి రామిరెడ్డి కర్రి గంగాధర రెడ్డి, బాలాజీ రెడ్డి, వైస్ ఎంపీపీ ఇందుకూరి సీతారామరాజు తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మాదకద్రవ్యాలకు బలికావొద్దు

విశాలాంధ్ర -భీమవరం: యువత దేశానికి వెన్నెముక అని, దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ అప్కా సిద్దీఖ్ అన్నారు. జమాతే ఇస్లామి హింద్ సంస్థ ఆధ్వర్యంలో సి.ఎస్.ఎన్. జూనియర్ కళాశాలలో "మత్తు రహిత సమాజ స్థాపన" అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా

ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో యువత ధూమపానం, మద్యం, మాదకద్రవ్యాలకు బానిసలై తమ బంగారు జీవితాన్ని చేజేతులా నాశనం చేసుకుంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి కుటుంబంలో ఒక్కరైనా ఈ దుర్వసనానికి బానిసగా మారి మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పాడు చేసుకోవడమే కాకుండా, కుటుంబ వ్యవస్థను సైతం తూట్లు పొడిచి, కుటుంబాలు ఆర్థికంగా దివాళా తీసి రోడ్డున పడే విధంగా కారకులుగా నిలుస్తున్నారని అందోళన వ్యక్తం చేశారు.యువత, విద్యార్థులు చాలా అప్రమత్తంగా చెడ్డవారితో, పరిచయంలేని క్రొత్త వారితో పరిచయాలు పెట్టుకోవద్దని, తల్లిదండ్రులు తప్ప ఇంకెవ్వరిని అతిగా నమ్మవద్దని ఆయన సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ ఎం.డి. సలీం ఖాన్, జమాతే ఇస్లామి హింద్ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ ఫర్హాన్, ఎస్.ఐ.ఓ. పట్టణ అధ్యక్షుడు ముహమ్మద్ అమీన్, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తునికి సాయం అందజేత

విశాలాంధ్ర - లింగపాలెం : కిడ్నీల వ్యాధితో అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీసీహెచ్ఆర్ పాలెంకు చెందిన పింగుల కుటుంబరావుకు స్నేహితులు, స్థానికులు కలిసి ఆర్థిక సాయం చేసి చికిత్స చేయిస్తున్నారు. బాధితునికి రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయి. డిగ్రీ వరకు చదివి నిరుద్యోగిగా ఉంటూ కూలి పనులకు వెళ్తూ భార్య, రెండేళ్ళ కూతురిని పోషిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఎటువంటి చెడు అలవాట్లు లేని బాధితుడు దురదృష్టవశాత్తు కిడ్నీల వ్యాధి బారినపడ్డాడు. వైద్యం కోసం స్నేహితులు, సహచరులైన పొదిల రమేస్, లక్కపాం రమేష్, పింగుల ప్రణయ్, భీమడోలు రాజేష్, పొదిల చిరంజీవి తదితరులు కలిసి రూ. 70 వేలు సేకరించి విరాళంగా బాధితుని వైద్యం కోసం అందించారు. మైత్రీ డవలపర్స్ వ్యవస్థాపకులు భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి బాధితునికి రూ. 25 వేలు, తెలుగుదేశం పార్టీ నాయకులు సొంగా రోషన్‌కుమార్ రూ. 20 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని లిడ్‌క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్ పరామర్శించి కొంత ఆర్థిక సాయం అందించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేస్తానని ఈయన బాధిత కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. కిడ్నీల వ్యాధితో బాధపడుతున్న బాధితుడు త్వరగా కోలుకోవాలని ప్రతీ ఒక్కరు కోరుకుంటున్నారు.

ఎస్ఆర్‌కెఆర్‌కు ఎన్‌బిఏ గుర్తింపు

విశాలాంధ్ర -భీమవరం: ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు జాతీయస్థాయిలో నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్(ఎన్ బి ఏ) మూడు సంవత్సరాలకు గాను గుర్తింపు లభించిందని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ తెలిపారు. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఒకేసారి ఆరు బ్రాంచీలకు ఎన్ బి ఏ గుర్తింపు రావడం తమ కళాశాలకు అరుదైన

రికార్డుగా పేర్కొన్నారు. గత డిసెంబర్ నెలలలో ఎన్ బీ ఏ బృందం కళాశాలలో పర్యటించిందన్నారు. కళాశాలలోని అన్ని అంశాలు పరిగణలోకి తీసుకొని మూడు సంవత్సరాల కాల పరిమితికి గాను తమకు అరుదైన గుర్తింపు లభించింది అని పేర్కొన్నారు. ఎన్ బీ ఏ ఈ మేరకు కళాశాలకు గురువారం ఆదేశాలు జారీ చేసింది అన్నారు. కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపల్ వివిధ విభాగాల హెడ్స్ ,డీన్స్ అందరూ కలిపి మీడియాతో తమ ఆనందాన్ని పంచుకున్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కే.వీ.మురళీకృష్ణమరాజులు మాట్లాడుతూ 43 సంవత్సరాల చరిత్ర కలిగిన తమ కళాశాల జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వేలాది ఇంజనీర్లను తీర్చిదిద్దటమే కాకుండా కేంద్ర ప్రభుత్వ పరిశోధనా సంస్థల నుండి కూడా ఎన్నో ప్రాజెక్టులు చేపట్టి సమాజానికి ఉపయోగపడే ప్రయోగాలు కూడా చేయటం తమ కళాశాలకు ఈ అరుదైన ఖ్యాతి లభించింది అన్నారు. కళాశాలలోని సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బ్రాంచీలకు ఎన్‌బిఏ గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్ ఆర్ కె నిశాంత్ వర్మ కళాశాల డైరెక్టర్ జగపతి రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణంరాజు, వివిధ విభాగాల హెడ్స్ ,డీన్స్ ను కూడా ప్రత్యేకంగా అభినందించారు.

కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

విశాలాంధ్ర - ముదినేపల్లి : కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దిన ఘనత వైసీపీకే చెందుతుందని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ పేర్కొన్నారు.మండలంలోని వడాలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. ప్రభుదాస్, విద్యా కమిటీ చైర్పర్సన్ పల్లి ఉమామహేశ్వరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ కోట్లాది రూపాయలతో నాడు నేడు పథకం ద్వారా పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం , అమ్మ ఒడి , విద్యా కానుక , విద్యా దీవెన లాంటి ప్రతిష్టాత్మక పథకాలతో విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఈ అవకాశాలను విద్యార్థులంతా సక్రమంగా సద్వినియోగం చేసుకోవా లన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు, నాటికలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మరీదు దుర్గశ్రీహనుమంతు, జడ్పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ పల్లి శ్రీదేవి శ్రీధర్, మర్రివాడ వీరారెడ్డి, బత్తిన కిషోర్, ఉపాధ్యాయులు సిహెచ్ నాగమల్లేశ్వరరావు, బిఎస్ ప్రకాష్, ఎన్. వాసవి, పి రంగబాబు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డ్రైవర్‌కు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : ప్రమాదానికి గురై ఆపదలో ఉన్న తోటి డ్రైవర్ కు టాటా మ్యాజిక్ యూనియన్స్ డ్రైవర్లు అంతా కలిసి అరవై వేల పదకొండు వందల రూపాయలను అందజేసి నట్టు కొయ్యలగూడెం టాటా మ్యాజిక్ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షులు వెలగల ధనరాజు, ధూళిపాల సత్యనారాయణ తెలిపారు. గాజువాకకు చెందిన టాటా మ్యాజిక్ డ్రైవర్



దామోదరంకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో అతనికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆల్ ఆంధ్ర టాటా మ్యాజిక్ యూనియన్ల డ్రైవర్ సోదరులందరూ కలిసి దామోదర్ కుటుంబ సభ్యులకు 60 వేల పదకొండు రూపాయలు అందజేసినట్టు పేర్కొన్నారు. డ్రైవర్ సోదరులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ధనరాజు పేర్కొన్నారు.

వలస పక్షులైతేనే విజయం సాధిస్తాయా?

బీసీలంటే బలిపశువులా...టీడీపీ పయనమెటు ?

విశాలాంధ్ర -చాట్రాయి: 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో 40ఏళ్ళచరిత్ర కలిగిన తెలుగు దేశం పార్టీలో నూజివీడు నియోజకవర్గంలో బలహీనవర్గాల సామాజిక తరగతుల ప్రజానీకంలో ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి అర్హత కలిగిన ఒక్క మనిషి కూడా లేరా...? వలస పక్షులు అయితేనే విజయం సాధిస్తాయా అనేది చర్చనీయాంశంగా మారింది. తెలుగుదేశం పార్టీ అధిష్టానం నూజివీడు శాసనసభ స్థానం అభ్యర్థి నిర్ణయం పై వ్యవహరిస్తున్న తీరు అనేక ప్రశ్నలను లేవనెత్తింది.

వైకాపా పెనమలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి తెలుగు దేశం పార్టీ నూజివీడు నియోజకవర్గ అభ్యర్థిగా తనను నియమించారని ఆగిరిపల్లి మండలంలోని అమ్మవారి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి పలు గ్రామాల్లో పర్యటిస్తూ పరిచయ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ తనను చంద్రబాబు నూజివీడు వెళ్ళమంటేనే వచ్చానని ఇంకా అనేక విషయాలు పరిచయ కార్యక్రమాల్లో చెప్పడం ప్రారంభించారు. దీనిపై కోపోద్రిక్తులైన ఆగిరిపల్లి మండలంలోని ప్రముఖ తెలుగుదేశం పార్టీ నాయకులు అంతా తీవ్రంగా ఖండిస్తూ సోషల్ మీడియాలో వీడియోలను ట్రోల్ చేయడంతో మరోసారి టిడిపి విభేదాలు భగ్గుమన్నాయి. తెలుగుదేశం పార్టీలో ఇప్పటివరకు టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు ఆయన వ్యతిరేకులకు మధ్య ముఠాలు నడవగా తెలుగుదేశం పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయంతో ఆ వర్గాలు,యాదవ సామాజిక తరగతి నేతల మధ్యలో పెద్ద వివాదంగా మారింది. నియోజకవర్గంలో అత్యధిక మంది యాదవులకు నిలయమైన ఆగిరిపల్లి మండలంలోని తెలుగుదేశం పార్టీ యాదవ సామాజిక తరగతికి చెందిన అగ్ర స్థాయి నాయకత్వం ముక్తకంఠంతో ముద్దరబోయిన పై కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. నిర్మాణాత్మకంగా పటిష్టమైన తెలుగుదేశం పార్టీ విలువలకు తిలోదకాలు ఇస్తుందని ధ్వజమెత్తారు. నియోజక వర్గం మొత్తం చర్చనీయాంశంగా మారింది. ఆరు నెలలకు ఒకళ్ళు మూడు నెలలకు ఒకళ్ళు వచ్చి ... మమ్మల్ని చూసుకోమన్నారు బాబు వెళ్ళమన్నారు అంటూ పరిచయ కార్యక్రమాలు తిరగడం పరిచయకార్యక్రమాలు పరిపాటిగా మారిపోయిందని పలువురు ఎద్దేవా చేస్తున్నారు. ఓసి సామాజిక తరగతి కి చెందిన నూజివీడు ఎఎంసి మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు ఒక జీవనదిలా పార్టీలో పదవులు ఉన్నా లేకపోయినా ఆర్థికంగా పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తూ పార్టీ కోసం పనిచేసినా పార్టీలో కనీసమైన పదవిలేని పరిస్థితి. పంచాయతీ సర్పంచ్ గా రావిచర్ల గ్రామస్తులు ఇచ్చిన పదవి, సుమారు ఒక సంవత్సరంన్నర క్రితం ముసునూరు మండలం గోగులంపాడు గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త పర్వతనేని గంగాధర్ టిడిపిలో ఎమ్మెల్యేగా పోటీ చేయడం కోసం ఉత్సాహంతో సుమారు రూ. 8 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఆయన కూడా అధిష్టానం వెళ్ళమంటే వచ్చానని అప్పట్లో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అట్లూరి రమేష్ గత కొన్ని సంవత్సరాల నుండి సందర్భానుసారం తెలుగుదేశం పార్టీ కోసం కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతూనే ఉన్నారు. ఇటీవల చంద్రబాబు సభకు సైతం పర్వతనేని గంగాధర్ పెద్ద ఎత్తున ఖర్చు పెట్టి అన్నదానాలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో 2లక్షల ముప్పై వేల మంది పైగా ఓటర్లు ఉండగా ఎస్సీ, ఎస్టీ,బి సి సామాజిక తరగతులకు చెందిన వారు లక్ష యాభై వేల మంది పైగా ఉన్నట్లు తెలుస్తోంది.40 ఏళ్ల తెలుగుదేశం పార్టీలో ఇక్కడ పుట్టి పెరిగిన వారిని ఒక్కరిని కూడా ఎమ్మెల్యే స్థాయికి అభివృద్ధి చేయలేదని అధిష్టాన నిర్ణయమే అద్దం పడుతుందని పలువురు అంటున్నారు.

ముదురుతున్న పోతుకుర్రు వివాదం

మూడవరోజు కొనసాగిన రిలే దీక్షలు

విశాలాంధ్ర - అమలాపురం : అయినవిల్లి మండలం పోతుకుర్రు జగనన్న లే అవుట్ మేరక చేసిన విషయంలో పనిచేసిన కూలీలు

సొమ్ము సుమారు ఏడున్నర లక్షలు కాజేసాడని అదే గ్రామానికి చెందిన కూలీలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి మూడవ రోజుకు చేరుకున్నాయి. ఈ ఘటనపై అమలాపురం ఆర్‌డిఓ ఆదేశాల మేరకు అయినవిల్లి ఎంపిడిఓ తన సిబ్బంది ఏపిఓ నాగబాబు, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్‌లు గ్రామంలో విచారణ నిర్వహించారు. తమ నివేదిక ఆర్‌డిఓకి అందజేస్తామని చెప్పారు. "గురువారం విశాలాంధ్రలో కూలీల కష్టాన్ని కాంట్రాక్టర్ బొక్కేసారు "శీర్షిక ప్రచురితమైన వార్త అధికారులు, రాజకీయ పార్టీల్లో కదలిక తీసుకువచ్చింది. జగనన్న లేఔట్‌లో కూలీల రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని టిడిపి నాయకులు, జనసేన ఎంపీటీసీ గుర్రాల రాంబాబు, పోతుకుర్రు మాజీ సర్పంచ్ గుమ్మడి సాగర్, మాజీ ఎంపీటీసీ మెల్లమ్ సత్యనారాయణ, మాల మహానాడు నాయకుడు కొంకి వెంకటరావు, పలువురు మహిళలు పాలొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి టిడిపితోనే సాధ్యం

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టిడిపి అధికార ప్రతినిధి ఎస్‌విఎస్ఎన్ వర్మ తెలిపారు. గురువారం కొమరగిరి పంచాయతీ పరిధిలో ఉన్న ఆనంద నగర్, నాగంపేట, చిన్న కలవల దొడ్డి, వెంకట్రాయపురంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో వర్మ పాల్గొని గడపగడపకు తిరుగుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు అమలవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు కరపత్రాలు అందించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడుతూ వైయస్సార్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు నష్టపోయారని, యువతకు ఉద్యోగ అవకాశాలు లేకుండా చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలి బట్టలను నొక్కుతున్నానని వారి కార్యకర్తలకే బట్టలను నొక్కుతూ మోసం చేస్తున్నట్లు తెలిపారు. అన్ని విధాలుగా రాష్ట్రం అభివృద్ధి టిడిపి, జనసేన ప్రభుత్వం రావాల్సిందేనని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు అనిశెట్టి సత్యానంద రెడ్డి, కటారి రాజబాబు, వెంకట పరమేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి బత్తుల చైతన్య రాజేష్ కుమార్, రాయుడు శ్రీరాములు, వెంకటేశ్వరరావు, దొరబాబు, ఆనాల బాలమురళీకృష్ణ, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో మెరుగైన ఆలోచన ఉండాలి

విశాలాంధ్ర - కాజులూరు : విద్యార్థుల్లో మెరుగైన ఆలోచన ఉంటే విద్యార్థుల జీవితం కూడా రోజురోజుకు మెరుగుపడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని మోహన్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మోహన్ పేర్కొన్నారు. గురువారం తమ విద్యా సంస్థల్లో 8వ తరగతి చదువుతున్న సలాది ప్రజ్వాలు గత సంవత్సరంలో కాకినాడ జిల్లా కాకినాడ స్థానిక సాలిపేట నగరపాలక ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి ఇన్స్పైర్ మానక్ 2023 సైన్స్ ప్రదర్శన నిర్వహించగా, ఆ ప్రదర్శనలో తమ సంస్థ నుంచి సలాది ప్రజ్వాలు నీటి పారుదల కొరకు పురుగుమందులతో ఆటోమేటిక్ నీటి ప్రవాహం అనే ప్రాజెక్టుపై ప్రదర్శన ఇవ్వగా ఆ ప్రదర్శన గురువారం రాష్ట్రస్థాయికి ఎంపిక

అయిందని తెలియడంతో కరస్పాండెంట్ మోహన్ విద్యార్థి సలాది ప్రజ్వాలను, ఉపాధ్యాయురాలు కవితను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ సంస్థ విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి కూడా చదువుతో ఉన్నత శిఖరాలను అధిరోహించడం కోసం దేశానికి ఉపయోగపడే విధంగా తమ ఆలోచన భావాలను మార్చుకుంటూ వివిధ రంగాల్లో ప్రయత్నం చేస్తూ ఉండాలన్నారు. అనంతరం ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రజ్వలన అభినందించారు.

విద్యతోనే లక్ష్యాల సాధన

విశాలాంధ్ర - కలిదిండి: విద్యార్థులు విద్యతోనే అనుకున్న లక్ష్యాలను సాధించి మంచి భవిష్యత్తును పొందగలరని మాజీ ఉపముఖ్య మంత్రి ఆళ్ల నాని విద్యార్థులకు సూచించారు. గురువారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయ మంగళ. వెంకటరమణతో కలిసి రిబ్బన్ కట్ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం రూ.8 కోట్లతో నూతనంగా నిర్మించిన వైఎస్ఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులు ఉన్నతంగా చదువుకొని తమ కలలను సాకారం చేసుకోవచ్చన్నారు. అన్ని వసతులతో విద్యార్థులకు సౌకర్యవంతంగా నిర్మించిన పాలిటెక్నిక్ కళాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బొర్రా సత్యవతి, ఎంపీటీసీలు చందన ఉమామహేశ్వరరావు, రామిశెట్టి సత్యనారాయణ ఉపాధ్యాయులు ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరి పీఠంలో రథసప్తమి వేడుకలు

విశాలాంధ్ర - పెద్దాపురం : స్థానిక వర్ధుల వారి వీధిలో వున్న భువనేశ్వరి పీఠంలో రథ సప్తమి వేడుకలు ఈనెల 16వ తేదీన నిర్వహించనున్నట్లు లలితా వాస్తు జ్యోతిష్యాలయ నిర్వాహకులు చింతా గోపీశర్మ సిద్ధాంతి తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రథ సప్తమి వేడుకల్లో భాగంగా ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సూర్య నమస్కార సహిత మహా సౌరహోమం నిర్వహించడం జరుగుతుందన్నారు. సుమారు 12 మంది ఋత్వికులచే సూర్య నమస్కారాలు నిర్వహించి ప్రసాద వితరణ జరుగుతుందని, పూజల్లో పాల్గొనే భక్తులు ముందుగా 9866193557 నెంబరుకు తెలియజేయాలని గోపీశర్మ సిద్ధాంతి కోరారు.

సహస్రలో వసంత పంచమి వేడుకలు

విశాలాంధ్ర - అమలాపురం : సహస్ర ఇంటర్నేషనల్ స్కూల్ నందు వసంత పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. దీనిలోని భాగంగా సహస్ర విద్యార్థినీ విద్యార్థులు సరస్వతి

దేవిని భక్తిశ్రద్ధలతో పూజించారు. క్రొత్తగా పాఠశాలలో చేరినటువంటి విద్యార్థిని, విద్యార్థులు, వారి యొక్క తల్లిదండ్రులు అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొనేరి.దీనిలో భాగంగా స్కూల్ డైరెక్టర్ ఆర్ వేణుగోపాలరావు. సహస్ర ప్రిన్సిపల్ గౌసియా బేగం, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయుల కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్ల పంపిణీ

విశాలాంధ్ర - పాలకొల్లు : పెనుమదం జిల్లా పరిషత్ హై హైస్కూల్లో కేరింగ్ అండ్ షేరింగ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎగ్జామ్ పాడ్స్, పెన్స్, స్టేషనరీని అందజేసే కార్యక్రమం గురువారం జరిగింది. మొత్తం 63 మంది పదవ తరగతి విద్యార్థులకు ఈ విద్యా సామగ్రిని అందజేశారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ కేరింగ్ అండ్ షేరింగ్ వెల్ఫేర్ సొసైటీ అందించే సహాయాన్ని సద్వి చేసుకోవాలని కోరారు. చక్కగా చదువుకుని విద్యార్థులు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సర్పంచ్ తానేటి బాబురావు, మండల వైఎస్ఆర్సిపి కన్వీనర్ పితాని సత్యనారాయణ (చిన్న), కేరింగ్ అండ్ షేరింగ్ వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ కడలి విజయ్ కుమార్ రాజు, ట్రెజరర్ కడలి మీరా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్

విశాలాంధ్ర-భీమవరం: ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమం నేడు శుక్రవారం కలెక్టరేట్లో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.భీమవరం కలెక్టరేట్ లో స్పందన సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం గం 10:30లకు ఉద్యోగుల గ్రీవెన్స్ ప్రారంభమవుతుందన్నారు. ఉద్యోగులు ఎవరైనా తమ సమస్యలు చెప్పుకోవచ్చన్నారు. గ్రీవెన్స్ సెల్‌కు వెళ్లదలచిన ఉద్యోగులకు అధికారులు అనుమతులు ఇవ్వాలన్నారు. జిల్లా అధికారులంతా అందుబాటులో ఉండాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేస్తున్న ఉద్యోగులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆ ప్రకటనలో కోరారు.